

జిల్లాలో విస్తారంగా వర్షాలు

➤ వాకాడు మండలంలో అత్యధికంగా 104.6 మిల్లీ మీటర్లు ➤ లోతట్టు ప్రాంతాలు జలమయం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: బంగాళాఖాతం అల్పపీడం ప్రభావంతో తిరుపతి జిల్లాలో ఇస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. మంగళవారం పలు మండలాల్లో వర్షాలు కురవడంతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. గత రెండు రోజుల నుంచి ఎడతెరపి లేకుండా వర్షాలు పడుతూ ఉండడంతో లోతట్టు ప్రాంతాలు జలమయ్యాయి. వర్షాల వల్ల ఉపాధి కూలీలకు, భవన నిర్మాణ రంగంలో పనిచేసే కార్మికులకు ఉపాధి లేకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. పలు మండలాల్లో రోడ్లు జలమయమయ్యాయి. వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు తూర్పు మండలాల ప్రాంతాల్లో ఉండే రెవిన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సెలవుల్లో ఉన్న రెవెన్యూ సిబ్బంది వెంటనే విధుల్లో చేరాలని ఆదేశించారు. పలు మండలాల్లో చెరువుల్లో మోస్తారు వర్షం నీరు వచ్చి చేరుతూ ఉండడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తిరుపతి నగరంలో పలుచోట్ల వర్షపు నీరు రోడ్లపై నిలిచిపోవడంతో పాదాచారులు, ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. వర్షం వల్ల ఎక్కడ 23 ప్రాంతాలు మునిగిపోకుండా మున్సిపల్ ఆరోగ్యశాఖ, ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులు సహాయ చర్యలు చేపడుతున్నారు. రేణిగుంట మండల వల్లిమడుగు డ్యామ్‌లో నీరు వచ్చి చేరుతుండడంతో ఇరిగేషన్ అధికారులు అప్రమత్తమయ్యారు.

● **వాకాడు మండలంలో అత్యధికం..**

తిరుపతి జిల్లా, వాకాడు మండలంలో మంగళవారం 104.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. అత్యల్పం నారాయణవనంలో 4.6 మిల్లీమీటర్లు నమోదయింది. సూళ్లూరుపేటలో 74.4, ఓజిలి, 62.8,కోట, 56 .6 దొరవారిసత్రం 53.8, చిట్టమూరు, 53.6,తడ, 48.6 తిరుపతి అర్బన్ 43.6, బాలయ్య పల్లి, 43. 4,తిరుపతి రూరల్, 41.6బి ఎన్ కండ్రిగ, 39.4, వడమాల పేట 38.6 ,వరదయ్యపాలెం, 38.2 శ్రీకాళహస్తి, 36.8, తొట్టంబేడు, 33.4,ఏర్పేడు, 33.2, రేణిగుంట, 32.4, వెంకటగిరి, 28.6, పెళ్లకూరు, 28.2, చంద్రగిరి, 26.2, గూడూరు, 23.4, కే వి బి పురం, 21.6, నాయుడుపేట, 21.6, సత్యవేడు, 20.2, చిల్లకూరు 19.2, ,పాకాల 19.2, రామచంద్రపురం 17.0, పుత్తూరు, 15.8, నాగలాపురం, 11.2, దక్కిలి, 9.8, పిచ్చాటూరు, 5.4, చిన్నగొట్టిగల్లు, 5.4 ఎర్రావారిపాలెం 5.2 వర్షపాతం నమోదవగా, మొత్తం జిల్లాలో 1117.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయినట్లు అధికారుల తెలిపారు.

● **లోతట్టు ప్రాంతాల వారు అప్రమత్తంగా ఉండాలి : నగర పాలక సంస్థ కమిషనర్**



వర్షాలకు లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య తెలిపారు. నగరంలోని పలు ప్రాంతాలను మంగళవారం కమిషనర్ పరిశీలించారు. ప్రజల నుండి వచ్చిన సమస్యలను అప్పటికప్పుడు పరిష్కరించి, ఎక్కడా వర్షపు నీరు నిలవకుండా చర్యలు చేపట్టారు. కమిషనర్ మాట్లాడుతూ కేశవాయన గుంట, పూర్ హోమ్ వద్ద వర్షపు నీరు రోడ్లపై వచ్చినట్లు తెలియడంతో పరిశీలించి పరిష్కరించామని తెలిపారు. డ్రైనేజి కాలువల ద్వారా నీరు వస్తున్న ప్రాంతాలను తమ సిబ్బంది పరిశీలించి పరిష్కరిస్తున్నారని తెలిపారు. మ్యాన్ హోల్స్ ఓపెన్ చేసి నీరు సజావుగా వెళ్లేలా చేస్తున్నామని, ప్రజలు ఇటువంటి ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. పాతబడిన భవనాల్లో ఎవ్వరూ ఉండరాదని, పునరావాస కేంద్రాలకు, లేదా బంధువుల ఇళ్లకు వెళ్లాలని తెలిపారు. చెట్లు పడిపోయే అవకాశం ఉన్నా, డ్రైనేజీ కాలువలు పొంగినా, ఇతర సాయం కొరకు కంట్రోల్ సెంటర్ ను సంప్రదించాలని తెలిపారు. టోల్ ఫ్రీ నంబర్లు 0877 222356776, 9000822909 లో 24 గంటలు సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు.

● **తిరుమలలో ఎడతెరపి లేని వర్షం.. పెరిగిన చలి తీవ్రత..**

ప్రజాశక్తి - తిరుమల: వాయుగుండం ప్రభావంతో మంగళవారం తెల్లవారుజాము నుండే తిరుమలలో భారీ వర్షం కురుస్తోంది. దీంతో భక్తులు ఇబ్బందులకు గురవుతున్నారు. శ్రీవారి దర్శనం చేసుకునే భక్తులు వర్షంలో తడవకుండా ఉండేందుకు జాగ్రత్తలు పడుతున్నారు. దర్శనం చేసుకుని వెలుపలకు వచ్చిన భక్తులు తలదాచుకునేందుకు షెడ్ల వైపుకు పరుగులు తీస్తున్నారు. భారీ వర్షాలు పడుతున్న సమయంలో ఘాట్ రోడ్లలో ప్రయాణించే భక్తులు జాగ్రత్తగా ఉండాలని టిటిడి సూచించింది. చలి తీవ్రత



ఎక్కువగా ఉండడంతో చిన్నారులు, వృద్ధుల విషయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని టిటిడి అధికారులు సూచించారు. ఇదిలా ఉండగా భక్తుల రద్దీ సాధారణం కంటే అధికంగా ఉంది. సోమవారం భక్తులతో అన్ని కంపార్ట్మెంట్లో నిండిపోగా శ్రీవారి సర్వదర్శనానికి 18 గంటల సమయం పట్టింది.

● **కొత్త చెరువుకు గండి**



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వడమాల పేట మండలం, లక్ష్మమ్మ కండ్రిగ, కొత్త చెరువుకు గండి పడింది. గతంలో ఈ చెరువు నుండి పొలాలకు నీటి సరఫరా అయ్యేది. అయితే 3 రోజులగా కురుస్తున్న వర్షాల కారణంగా చెరువు నీటి మట్టం పెరిగి, కట్ట తెగిపోయింది. దీంతో ఎస్టి కాలనీవాసుల రాకపోకలు స్తంభించాయి. ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఆదేశాలతో రెవెన్యూ, ఇరిగేషన్, పోలీస్ అధికారులు చెరువు గండిని మట్టితో పూడ్చి ప్రస్తుతానికి ఇబ్బంది లేకుండా చేశారు.

● **భారీ వర్షాలతో అప్రమత్తంగా ఉండండి : ఎమ్మెల్యే కురుగొండ్ల**



ప్రజాశక్తి - వెంకటగిరి: వాయుగుండం ప్రభావంతో రాష్ట్ర దక్షిణ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో వెంకటగిరి ఎమ్మెల్యే శ్రీ కురుగొండ్ల రామకృష్ణ ప్రజలకు అప్రమత్తం చేస్తూ కీలక సూచనలు చేశారు. అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కండలేరు జలాశయం పరిస్థితిపై నిరంతరం సమీక్షించాలని అధికారులకు తెలిపారు. ముంపు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు హెచ్చరికలు జారీ చేయాలన్నారు. ప్రజలు ఎలాంటి ఇబ్బంది వచ్చినా అధికారులకు సమాచారం అందిచాలని కోరారు.

● **కండలేరు జలాశయాన్ని ముంచెత్తుతున్న వరద**

నెల్లూరు జిల్లా, కండలేరు జలాశయానికి వరద నీటి ప్రవాహం పెరుగుతోందని, నీటి పారుదల శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. తుపాను ప్రభావంతో జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున నీరు వచ్చి చేరుతోంది. జలాశయాన్ని మంగళవారం ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అధికారులతో కలిసి పరిశీలించారు. డ్యాం అతిది గృహంలో ఇంజినీర్లతో సమీక్ష నిర్వహించారు. ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

● **వర్షాలతో గ్రామీణ రోడ్లు ఛిద్రం**



ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు గ్రామీణ ప్రాంతాల రోడ్లు అధ్వానంగా మారాయి. మండల పరిధిలోని కొత్త కండ్రిగ, వెస్ట్ వరత్తూరు, కరకంబట్టు, తలారవెట్టు, విఎస్ పురం, పూసలపల్లి గ్రామాల్లో రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. జంబుగోళం రోడ్డు పూర్తిగా ఛిద్రమైంది. శ్రీకాళహస్తి తడ రోడ్డునుంచి 14 గ్రామాలను కలుపుతూ 15 సంవత్సరాల క్రితం రోడ్డు నిర్మించారు. అయితే ఈ రోడ్డుకు ఇప్పటి వరకు ఎటువంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో గుంతులమయమైంది. ఆర్ అనంతపురం, జీఎన్ కండ్రిగ, పూసలపల్లి సమీపంలో రోడ్డు కోతకు గురైంది. అధికారులు వెంటనే స్పందించి రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

● **విద్యార్థుల హాజరుపై వర్షం ప్రభావం**

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: తిరుపతి జిల్లా, బుచ్చినాయుడు కండ్రిగ మండలంలోని మోడల్ ప్రైమరీ పాఠశాలను మంగళవారం మండల విద్యా అధికారి, ముని సుబ్రహ్మణ్యం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఫార్మాటివ్ అసెస్మెంట్ అభివృద్ధి పరీక్ష మూల్యాంకన పుస్తకాలను పరిశీలించారు. మొత్తం విద్యార్థుల సంఖ్య 109 కాగా, కేవలం 19 మంది విద్యార్థులే పాఠశాలకు హాజరయ్యారని, భారీ వర్షం కారణమని ఆయన పేర్కొన్నారు. అనంతరం ఉపాధ్యాయులకు బోధనా పద్ధతులపై పలు సూచనలు చేశారు.

● **ఉపాధి కోల్పోయిన వారిని ఆదుకోండి**

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: గత ఐదు రోజులుగా కురుస్తున్న ఎడతెరిపిలేని వర్షాల కారణంగా మండలంలోని అనేక గిరిజన ప్రాంతాలలో ప్రజలు వారి దైనందిన జీవితానికి నష్టం కలిగిందని, అనేకమంది రోజువారి కూలీనాలీ చేస్తూ బ్రతికే పేదవారికి భృతి లేకుండా పోయిందని సిపిఐ మండల కార్యదర్శి కత్తి ధర్మయ్య ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ వర్షాల కారణంగా ఉపాధి కోల్పోయిన గిరిజనులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. తక్షణసాయంగా 2000 రూపాయలు, నిత్యావసర సరుకులు అందించాలని కోరారు. దెబ్బతిన్న గుడిసెలను నిర్మించుకునేందుకు సాయం అందించాలని కోరారు.

● **వర్షాలకు దెబ్బతిన్న రైతాంగం**

మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు రైతాంగం తీవ్రంగా నష్టపోయింది. రైతులు సగం భాగం పైగా నార్లు పోసిఉండటంతో నారు నీటి పాలైంది. అధికారులు గ్రామాలకు వెళ్లి పరిశీలించి రైతులకు నష్టపరిహారం ఇప్పించాలని మండల రైతాంగం కోరుతున్నారు.

● **అప్రమత్తంగా ఉండాలి**

ప్రజాశక్తి - నాయుడుపేట: కురుస్తున్న భారీ వర్షాలకు ప్రజలు ప్రమాదాల బారిన పడకుండా చూసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందని డిఎల్‌పిఓ, ఎంపీడీవోలు సూచించారు. గత నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా నాయుడుపేట మండలంలో కురుస్తున్న భారీ వర్షాలకు గ్రామాలలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు ప్రజలకు తెలియజేశారు. ఈ వర్షాల బారిన పడి ప్రజలు ఇబ్బందులు పడకుండా తక్షణమే తగిన చర్యలు చేపట్టాలని డిఎల్‌డోఓ జాలిరెడ్డి, ఎంపిడిఓ కె.సురేష్ బాబు కోరారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన సమావేశంలో పాల్గొని ప్రజలు ఈ వర్షాలకు ప్రమాదాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి పంచాయతీ కార్యదర్శులకు వివరించారు. పంచాయతీ కార్యదర్శులు ఆయా గ్రామాల ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకుంటూ ప్రజలకు ప్రమాద సూచికలు తెలియజేస్తూ ప్రజలను అప్రమత్తం చేయాలని తెలిపారు.

● **స్తంభించిన జనజీవనం .. చప్పగా దీపావళి సంబరాలు**



ప్రజాశక్తి - రామచంద్రపురం : నాలుగు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో మండల పరిధిలోని గ్రామాల్లో జనజీవనం స్తంభించిపోయింది. ఆనంద ఉత్సవాలతో జరుపుకోవాల్సిన దీపావళి పండుగ సంబరాలు చప్పబడిపోయాయి. దీపావళికి స్వగ్రామాలకు వచ్చిన ప్రైవేటు ఉద్యోగస్తులు, సాఫ్ట్వేర్ ఇంజనీర్లు, ఉద్యోగస్తులు తిరిగి పట్టణాలలో విధుల్లో చేరేందుకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఎడతెరపలేని వర్షాలకు భూముల నుండి ఊట నీరు ప్రవహిస్తున్నాయి. మండలంలోని అనుపల్లె, వేపకుప్పం, పుల్లమనాయుడు కండ్రిగ, తిమ్మరాజు పల్లి, సీకేపల్లి గ్రామాల నుండి పెద్దేటి వంక ద్వారా రాయల చెరువుకు వర్షపు నీరు కొంతమేరకు చేరుకోవడంతో రాయలచెరువు నీటిమట్టం పెరిగింది. వర్షానికి గ్రామాలలో పాడి రైతులు తమ పశువులకు పశుగ్రాసం లేక, బయట మేపుకోలేక, పాకలోనే పశువులను కట్టేసి ఆకులు అలములను మేతగా వేస్తున్నారు. వంకలు, కుంటలు వర్షపునీటితో నిండి కళకళలాడుతున్నాయి. భూగర్భ జలాలు పెరిగాయి. అప్రమత్తంగా ఉండాలని, గ్రామ రెవెన్యూ అధికారులు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని తహాశీల్దార్ మధుసూదన్ రావు ఆదేశించారు.

ఏపిపిటిడి మహాసభలను జయప్రదం చేయండి



ప్రజాశక్తి - తిరుపతి టౌన్: ఆర్టీసి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర 13వ మహాసభలు ఈనెల 23, 24 తేదీలలో జరుగనున్నాయి. ఈ మహాసభకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని డిపోల నుండి 200 మంది ప్రతినిధులు హాజరుకానున్నారు. నేటి ఆర్టీసీ పరిస్థితులను పరిశీలించి గత మహాసభలలో తీసుకున్న నిర్ణయాలు సమీక్ష చేసుకొని రాబోయే మూడు సంవత్సరాలకు ఆర్టీసీ పరిరక్షణ, కార్మికుల హక్కుల రక్షణకై తీసుకోవాల్సిన నిర్ణయాలను ఈ మహాసభలో నిర్ణయించనున్నారు. ఈ మహాసభకు ముఖ్యఅతిధులుగా జీవన్ కృష్ణ సహా, ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి, సిఐటియు రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఏవి నాగేశ్వరరావు, సిహెచ్ నరసింగరావులు హాజరుకానున్నారు. మహాసభల ఏర్పాటక్లలో భాగంగా మంగళవారం సిఐటియు కార్యాలయంలలో ముఖ్య కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు జి బాలసుబ్రమణ్యం, సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జయచంద్ర, సుబ్రహ్మణ్యం, బుజ్జమ్మ, మాధవ్, ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కే పరశురాం, మునిరాజా, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

రంగంపేటలో ఏనుగుల బీభత్సం



ప్రజాశక్తి - చంద్రగిరి: చంద్రగిరి మండలం, రంగంపేట పరిధిలోని శివాలయం దగ్గర సోమవారం ఉదయం 3 గంటల ప్రాంతంలో ఏనుగుల గుంపు గ్రామానికి ఆనుకొని ఉన్న రైతు విజయ్ కుమార్ పొలంలోకి దూసుకువచ్చి అరటి చెట్లు, కొబ్బరి చెట్లు, గడ్డిని ధ్వంసం చేసాయి. పొలానికి వేసి ఉన్న పెన్సింగ్‌ను ధ్వంసం చేసి బోర్ మోటార్, బోర్ నుండి పొలానికి నీటి సరఫరాకు అమర్చిన పైపులను కూడా ధ్వంసం చేసి తిరిగి అడవిలోకి వెళ్లాయి. గ్రామస్తులు భయాందోళనకు గురై అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. అటవీ శాఖ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని ధ్వంసం చేసిన ప్రదేశాన్ని పరిశీలించి, ప్రజలు రాత్రిపూట అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ రోజు రాత్రికి కందులవారిపల్లి, నారావారిపల్లి, నాగపట్ల, కళ్యాణిడాం పీటీసీ ప్రాంతాలలో కూడా సంచరించే అవకాశం ఉందని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. పైన తెలిపిన ప్రాంతాలను అలెర్ట్ చేసి, ప్రజలు భయభ్రాంతులకు గురి కాకూడదని తెలియజేసి, సమాచారం వెంటనే అందించాలని గ్రామస్తులని అధికారులు కోరారు.

ఈశాన్య రుతుపవనాల ప్రభావంపై సమీక్ష



ప్రజాశక్తి - తిరుపతి టౌన్:ఈశాన్య రుతుపవనాల ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని, తిరుపతి జిల్లా కలెక్టరేట్‌లో మంగళవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంలో భారీ వర్షాలు, వరదల, ఇతర ప్రకృతి వైపరీత్యాల వల్ల ఏర్పడే నష్టాలను తగ్గించడానికి ఏర్పాట్లు, జాగ్రత్తలు తీసుకోవడం విషయంపై దిశా నిర్దేశాలు జారీ చేశారు. అన్ని శాఖాధికారులు అప్రమత్తంగా ఉండి, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మున్సిపల్ కమీషనర్లు లోతట్టు ప్రాంతాలను పర్యవేక్షించి, వరద నీరు పంపించే వ్యవస్థలు సక్రమంగా పనిచేయించేలా చూడాలని, అవసరమైన యెడల సహాయ కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రాథమిక చికిత్స, ఔషధాలు సరఫరా వంటి అంశాలలో ఆరోగ్యశాఖకు పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలని, పశు సంరక్షణ విభాగం పశువులను సురక్షిత ప్రదేశాలకు తరలించేందుకు ప్రణాళికలు రూపొందించాలని, వ్యవసాయం, ఉద్యాన శాఖ రైతులకు వరద ప్రభావాలను తగ్గించుకునే మార్గాలు తెలియజేయాలని కలెక్టర్ ఆదేశించారు.లోతట్టు ప్రాంతాలను ముందుగానే గుర్తించి, అవసరమైనచోట రిలీఫ్ సెంటర్లకు ప్రజలను తరలించుటకు అన్నిఏర్పాట్లుచేయాలని సూచించారు. రోడ్లు, విద్యుత్, తాగునీటి, ఆరోగ్య మరియు అగ్నిమాపక శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వానికి చెందిన ప్రమాదకర స్థితిలో ఉన్న భవనాలను గుర్తించాలన్నారు. ముఖ్యంగా పాత పాఠశాల భవనాలు, అంగన్వాడీ కేంద్రాలు, ఇతర ప్రభుత్వ కార్యాలయ భవనాలను గుర్తించి, అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ సందర్భంగా తిరుపతి కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్(ఫోన్ నెం. 0877-2236007) ప్రారంభించబడింది. అదేవిధంగా ప్రతి రెవెన్యూ డివిజన్ మరియు మండల స్థాయిలో కూడా కంట్రోల్ రూమ్లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. అన్ని ఆర్డీవోలు, తహసీల్దార్లు తమ పరిధిలోని శాఖలతో సమీక్షా సమావేశాలు నిర్వహించి, తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా ప్రజాలందరూ వర్షాల సమయంలో అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. విపత్తు సమయంలో అధికారులు సమన్వయంతో పనిచేయాలని, నియమాలు పాటించకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

దెబ్బ తిన్న చెరువు కలజు



ప్రజాశక్తి - బాలాయపల్లి : ఏడతేరిపి లేని వర్షంతో మండలంలోని జయంపు చెరువు కలజు కొంత మేర దెబ్బ తిని కోతకు గురైంది. మంగళవారం జలవనరుల శాఖ ఏఈ వెంకటేశ్వర్లు, వీఆర్వో చైతన్యలు పరిశీలించి ఉన్నతాధికారులకు సమాచారమందించారు. చెరువు కట్ట దెబ్బ తినకుండా మరమ్మతులు చేపడుతామని తెలిపారు.

టీటీడీ ట్రస్ట్‌లకు భారీగా విరాళాలు

● **11 నెలల్లో 918.6 కోట్లు**

ప్రజాశక్తి - తిరుమల: తిరుమల తిరుపతి దేవస్థానం ట్రస్ట్‌లకు భారీగా విరాళాలు వచ్చాయి. 11 నెలల్లో రికార్డు స్థాయిలో రూ.918.6 కోట్లు విరాళాలు (2024 నవంబర్ 1 నుంచి -2025 అక్టోబర్ 16వ తేదీ వరకు) దక్కాయి.కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక టీటీడీకి దాతలు క్రమంగా పెరుగుతున్నారు. టీటీడీ చైర్మన్‌గా బీఆర్ నాయుడు బాధ్యతలు చేపట్టాక టీటీడీ ట్రస్ట్‌లకు వెల్లువలా విరాళాలు వస్తున్నాయి.దాతలకు తగిన గౌరవం, సదుపాయాలు కల్పించడంలో ఎక్కడా లోపం తలెత్తకూడదని బీఆర్ నాయుడు ఆదేశాలు ఇచ్చారు. ట్రస్ట్‌లకు విరాళాలతో పాటు పలు నిర్మాణాలు, యంత్రాల కొనుగోలు, సాంకేతిక అభివృద్ధికి దాతలు సంపూర్ణ సహకారం అందిస్తున్నారు. అత్యధికంగా ఎస్వీ అన్నప్రసాదం ట్రస్ట్ కు రూ.338.8 కోట్ల విరాళం వచ్చింది. ఆఫ్ లైన్ కంటే ఆన్ లైన్ ద్వారానే ఎక్కువ సంఖ్యలో విరాళాలు సమర్పిస్తున్నారు. ఆన్ లైన్ ద్వారా రూ. 579.38 కోట్లు, ఆఫ్ లైన్ ద్వారా రూ.339.20 కోట్ల విరాళాలు అందించారు.

ఏ ట్రస్ట్‌కు ఎంత..

శ్రీవాణి ట్రస్ట్‌కు రూ.252.83 కోట్లు, శ్రీబాలాజీ ఆరోగ్య వరప్రసాదిని స్కీమ్‌కు 97.97 కోట్లు, ఎస్వీ ప్రాణదాన ట్రస్ట్‌కు రూ.66.53 కోట్లు, ఎస్వీ గో సంరక్షణ ట్రస్ట్ కు రూ.56.77 కోట్లు, ఎస్వీ విద్యాదాన ట్రస్ట్ కు రూ. 33.47 కోట్లు, బర్డ్ ట్రస్ట్ కు రూ.30.02 కోట్లు, ఎస్వీ సర్వశ్రేయాస్ ట్రస్ట్‌కు రూ.20.46 కోట్లు, ఎస్వీ వేదపరిరక్షణ ట్రస్ట్‌కు రూ. 13.87 కోట్లు, ఎస్వీబిసీకు రూ.6.29 కోట్లు, స్విమ్స్‌కు రూ. 1.52 కోట్లు.

శ్రీవారి ఆలయంలో దీపావళి ఆస్థానం

తిరుమల శ్రీవారి ఆలయంలో దీపావళి ఆస్థానం శాస్త్రోక్తంగా జరిగింది. శ్రీ మలయప్పస్వామి, శ్రీ-భూ అమ్మవార్లు, విష్వక్సేనుల వారి ఉత్సవ మూర్తులను గరుడాళ్వారు సన్నిధిలో ఉంచి ఆస్థానం నిర్వహించారు. స్వామి ,అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి కర్పూర మంగళహారతులు సమర్పించి ప్రసాద నివేదనలను అర్చకస్వాములు ఆగమోక్తంగా నిర్వహించారు. నూతన పట్టు వస్త్ర సమర్పణను మూలవిరాట్టు, దేవతా ఉత్సవమూర్తులకు ధరింపజేసి రూపాయి హారతి, ప్రత్యేక హారతులను నివేదించారు. దీంతో తిరుమల శ్రీవారి ఆలయంలో దీపావళి ఆస్థానం పూర్తి అయినది. అనంతరం తీర్థ, శఠారి మర్యాదలతో ఆలయ అధికారులను అర్చకులు ఆశీర్వదించారు' అని టీటీడీ తెలిపింది.

ట్రంప్ సుంకాలపై నిరసన



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ట్రంప్ విధించిన సుంకాలకు వ్యతిరేకంగా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నారాయణవనం మండల కమిటీ ఆధ్వర్యంలో వెతలతడుకు, పాలమంగళం గ్రామాలలో ట్రంప్ చిత్రపటాన్ని తగులబెట్టి నిరసన వ్యక్తం చేశారు. మండల కార్యదర్శి ముని శంకర్ మాట్లాడుతూ భారతదేశం నుంచి వ్యవసాయ ఉత్పత్తులు ఎగుమతులపై 11 శాతం ఉన్న సంకాలను 50 శాతానికి పెంచడం ట్రంప్ దాష్టీకమన్నారు. ఈ విషయమై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించడంలేదని ఆరోపించారు. ఈ సుంకాలతో వ్యవసాయ ఉత్పత్తులపై తీవ్ర ప్రభావం పడిందని, వ్యవసాయ కూలీలు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వెత్తల తడకు గ్రామస్తులు రాజేష్ తదితరులు, పాలమంగళం గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని పెద్ద పాలేడు పంచాయితీలో సోమవారం అమెరికా సంకాలను వ్యతిరేకించాలని కోరుతూ వ్యవసాయ కార్మిక మండల కార్యదర్శి బాల గురవయ్య ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ట్రంప్ వ్యవసాయ ఉత్పత్తులపై పెంచిన సుంకాలకు నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా ట్రంప్ దిష్టిబొమ్మలు తగలబెట్టి నిరసన తెలుపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - కెవిబి పురం: ట్రంప్ విధించిన సుంకాలకు వ్యతిరేకంగా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం సిఐటియు మండల కమిటీ ఆధ్వర్యంలో రాయపేడు, కేవీబి పురం గ్రామాలలో ట్రంప్ చిత్రపటాన్ని తగలబెట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి నాగలాపురం నాగరాజు, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి జనార్ధన్‌లు మాట్లాడుతూ వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులపై పన్ను పెంచడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో రాయపేడు గ్రామస్తులు బాలయ్య, నాగూరు లోకనాథం, సుబ్బరామయ్య, అనిత, తదితరులు పాల్గొన్నారు.

వర్షంలో తడుస్తూ నిరసన దీక్ష



ప్రజాశక్తి - తిరుపతి టౌన్: శ్రీవారి మెట్టు వ్యాపారస్తుల సమస్యల పై గత 427 రోజుల నుంచి నిరసన దీక్ష చేస్తున్నారు. దీపావళి పండుగ రోజున దీపాలు వెలిగించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఎస్ జయ చంద్ర మాట్లాడుతూ ఈ సమస్యను పరిష్కరించాలని టిటిడి ఈవోకు అనేకసార్లు విన్నవించుకున్నా పరిష్కరించకపోవడం చాలా బాధాకరమన్నారు. అన్ని రకాల పండుగలు టెంట్లోనే చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. గత మూడు రోజుల నుంచి వర్షాలు పడుతున్నప్పటికీ లెక్కచేయకుండా అనారోగ్యాలు గురవుతూ నిరసన దీక్షను చేస్తున్నారని తెలిపారు. పరిపాలన అధికారులు కనీసం మానవతా దృక్పథంతో ఆలోచించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం మానవసేవే మాధవ సేవ అని ప్రచారం చేస్తున్న ఆ పరిపాలన భవనం ముందే 427 రోజుల నుంచి 31 కుటుంబాలు నిరసన దీక్షలో ఉంటే కనీసం పట్టించుకోకపోవడం లేదన్నారు. తక్షణమే సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని సిఐటియు విజ్ఞప్తి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీవారి మెట్టు వ్యాపారస్తుల సంఘం నాయకులు చిరంజీవి పెంచలయ్య, ప్రకాష్, రామ్మూర్తి, గోపి, తదితరులు పాల్గొన్నారు.

పనులు త్వరితగతిన పూర్తి చేయండి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్ట్ పనులు సంబంధించిన పలు భూ సంబంధిత పెండింగ్ నిర్మాణ పనులను ప్రణాళిక భద్దంగా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జాతీయ రహదారులకు, రైల్వే ప్రాజెక్ట్ పనులు సంబంధించిన పలు భూ సంబంధిత పెండింగ్ అంశాలు, నిర్మాణ పురోగతి పనులపై జిల్లా కలెక్టర్ వర్చువల్ విధానంలో తిరుపతి, నెల్లూరు, చెన్నై నేషనల్ హైవే పి డి లు, తిరుపతి, సూళ్లూరుపేట, శ్రీకాళహస్తి ఆర్డీఓలు, రామ్మోహన్, భానుప్రకాష్ రెడ్డి, కిరణ్మయి సంబంధిత మండలాల తహాశీల్దార్లు, తదితర సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. తిరుపతి జిల్లాలో జాతీయ రహదారుల అభివృద్ధి కొరకు చేపడుతున్న జాతీయ రహదారుల నిర్మాణ పనులు, రైల్వే ప్రాజెక్ట్స్ పనులు పురోగతిలో ఉన్న పనులపై రేణిగుంట, పూడి, గూడూరు, రేణిగుంట, పాకాల, తిరుపతి టౌన్ సంబంధించిన రైల్వే ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలన్నారు. నడికుడి శ్రీకాళహస్తి రైల్వే ప్రాజెక్టు పనులకు సంబంధించిన పనులు వేగవంతం చేయాలని తెలిపారు. ఆరు లైన్లు రహదారులు నిర్మాణం, తిరుపతి బైపాస్ వేగవంతం చేయాలని, రేణిగుంట నుండి చెన్నై రహదారుల పనులు పూర్తి చేయాలని భూ సేకరణకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. ప్యాకేజీ 2,3,4 జాతీయ రహదారి పనులు సాగరమాల కింద చేపట్టిన వాటిని పెండింగ్ లేకుండా రెవెన్యూ డివిజనల్ అధికారులు నేషనల్ హైవే అధికారులతో సమన్వయంతో చేసుకొని నాణ్యతతో పనులుపూర్తి కావాలని అన్నారు. తిరుపతి రేణిగుంట బైపాస్ సంబంధించిన పెండింగ్ భూ సమస్యలను పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ లను ఆదేశించారు. ఏపీఐఐసీ ప్యాకేజీ 5, ఎడిబి రోడ్లు పనులు త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ విజయ్ భరత్ రెడ్డి, డెప్యూటీ తహసీల్దార్లు , తదితరులు పాల్గొన్నారు.

రేవంత్ ఇంట్లో బొజ్జల దీపావళి సందడి



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: హైదరాబాదులోని తెలంగాణా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంట్లో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి సోమవారం దీపావళి వేడుకలు చేసుకున్నారు. రేవంత్, బొజ్జల కుటుంబం ఉత్సాహంగా దీపావళి వేడుకలు జరుపుకున్నారు. మాజీ మంత్రి బొజ్జల కుటుంబానికి, రేవంత్ కు అత్యంత సాన్నిహిత్యం ఉంది. ఈ కారణం చేత బొజ్జల కుటుంబం రేవంత్ ఇంట్లో దీపావళి సంబరాలు చేసుకున్నారు.

యువతరంగ్‌లో ఎమరాల్డ్స్ డిగ్రీ కళాశాల విజయాలు



ప్రజాశక్తి - తిరుపతి (మంగళం): యస్వీయు ఆధ్వర్యంలో నిర్వహించిన యువతరంగ్ 2025లో ఎమరాల్డ్స్ డిగ్రీ కళాశాల విద్యార్థులు అత్యద్భుత ప్రతిభను చూపి ఘన విజయాలను సొంతం చేసుకున్నట్లు ఎమరాల్డ్స్ డిగ్రీ కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ మునిరత్నం తెలిపారు. విద్యార్థులకు సృజనాత్మక, సాంస్కృతిక మేధోపరమైన విభాగాల్లో నిర్వహించిన పోటీలలో ఎమరాల్డ్స్ కళాశాల విద్యార్థులు ముఖ్యమైన స్థానాలను దక్కించుకున్నారన్నారు. ఈ సందర్భంగా ఎమరాల్డ్స్ డైరెక్టర్లు డాక్టర్ గిరిధర్, సిఏ విశ్వనాథ్ మాట్లాడుతూ తమ కళాశాలలో అందించే నాణ్యమైన విద్యా ప్రమాణాలే విద్యార్థులు సాధించిన అద్భుతమైన ఫలితాలకు నిదర్శనమన్నారు. అద్భుత విజయాలు సాధించిన విజేతలకు, అధ్యాపక బృందానికి ప్రత్యేక అభినందనలు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్లు శ్రీనివాసులు, జానకిరామ్, నాదముని, ప్రిన్సిపాల్ జాఫర్ వల్లి పాల్గొన్నారు.

మఠం భవనాన్ని కాపాడండి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శ్రీ స్వామి హథీరాం బావాజీ మఠం భవనాన్ని చారిత్రాత్మక కట్టడంగా గుర్తించి కాపాడుతూ పునరుద్ధరణకు చర్యలు తీసుకొని బంజారా వారసత్వ సంపదను భావితరాలకు అందించాలని బిజెపి జిల్లా అధ్యక్షులు సామంచి శ్రీనివాస్, టిటిడి బోర్డు సభ్యులు భానుప్రకాష్ రెడ్డి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కలిసి వినతి పత్రం అందించారు. కలెక్టర్ వెంకటేశ్వర్ సానుకూలంగా స్పందించారని తెలిపారు.

ఎస్ఐ హరి ప్రసాద్‌కు సన్మానం

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన హరి ప్రసాద్‌ను బుచ్చినాయుడు కండ్రిగ మండల నాయకులు ముని చంద్ర నాయుడు, మాజీ జడ్పిటిసి వీరరాఘవులు, సముద్రాల రవి నాయుడు, కార్తీక్ చౌదరి, తుమ్మల రాజేందర్ నాయుడు, వెంకటరత్నం, ఎక్స్ ఎంపిటీసీ లోకయ్య, టిడిపి నాయకులు ఘనంగా సన్మానించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : వడమాల పేట మండలం, వేమూరుకు చెందిన ఎల్లమ్మ అనారోగ్యంతో హాస్పిటల్‌లో అడ్మిట్ అయ్యారు. ఆసుపత్రి వైద్య ఖర్చులకు సీఎం సహాయ నిధినుంచి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ నిధులు మంజూరు చేయించారు. మంగళవారం ఎమ్మెల్యే కార్యాలయంలో బాధితురాలి కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల చెక్కును ఎమ్మెల్యే అందచేశారు.

ఘనంగా ఎంపిటీసీ మొబీన్ బాష జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి -కోట : కోట పట్టణంలో బాంబే కట్ పీసెస్ అధినేత, ఎంపిటీసీ షేక్ మొబీన్ బాష జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మొబీన్ బాషను అభిమానులు, పలువురు వ్యాపారులు సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. మండల పరిధిలోని పలువురు నాయకులు మొబీన్ బాషాకు జన్మదిన శుభాకాంక్షలు తెలియచేశారు.

ఒకటవ పట్టణ ఎస్ఐగా మనోజ్ కుమార్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు ఒకటవ పట్టణ ఎస్ఐగా మనోజ్ కుమార్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన గూడూరు రూరల్ పోలీస్ స్టేషన్ నుండి గూడూరు ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ పరిధిలో ట్రాఫిక్ నియంత్రణ, అసాంఘిక కార్యక్రమాల నియంత్రణకు కృషి చేస్తామన్నారు.

రావూరి రమాదేవి సంస్మరణ సభ

ప్రజాశక్తి-పుత్తూరుటౌన్: పరమేశ్వర మంగళం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు, చంద్రశేఖర్ శెట్టి అధ్యక్షతన కీర్తిశేషులు రావూరి రమాదేవి సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి అతిథిలుగా రమాదేవి భర్త రామకృష్ణ నాయుడు, సోదరులు శంకర్ నాయుడు, భాస్కర్ నాయుడు, ఢిల్లీ బాబు, రామకృష్ణ నాయుడు సోదరి రాజేశ్వరి, మేనల్లుడు యువ శాస్త్రవేత్త డాక్టర్ మహేష్‌లు హాజరయ్యారు. కార్యక్రమం అనంతరం విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టారు.

ఎస్‌కేఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్‌గా శ్రీనివాసులు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : స్థానిక ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ వై.శ్రీనివాసులు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. డిపార్ట్మెంట్ ఆఫ్ కామర్స్‌లో సీనియర్ అధ్యాపకులుగా పనిచేస్తున్న ఆయన కమిషనర్ ఆఫ్ కాలేజీ ఏట్ ఎడ్యుకేషన్ ఉత్తర్వుల మేరకు ఇదివరకే ఎఫ్ఎసి ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయనను అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

పేద కుటుంబాలకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కోట: తిరుపతి జిల్లా, వాకాడు మండలం, బాలిరెడ్డి పాళెం, శ్రీ పట్టాభిరామాలయం కేంద్రంగా నడపబడుతున్న శ్రీ సీతారామ థార్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రవాస భారతీయులు రామిరెడ్డి వేంకటరామిరెడ్డి, హైమావతమ్మ దంపతుల ఆర్థిక సౌజన్యంతో నాలుగు పేద కుటుంబాలకు 55వేల రూపాయలను మాజీ సొసైటీ చైర్మన్, ఆలయ ధర్మకర్త కొడవలూరు దామోదర్ రెడ్డి ఆన్ లైన్ ద్వారా అందచేశారు. ఈ కార్యక్రమంలో శ్రీరామసేన అధ్యక్ష, కార్యదర్శులు కొడవలూరు హరీష్ రెడ్డి, పోలిపాటి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి కృషి చేయండి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో, మండలం సర్వ సభ్య సమావేశం మండలాధ్యక్షుడు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతి జిల్లాలో వర్షాలు శాతం ఎక్కువగా ఉన్నందువలన మెడికల్, ఆర్ అండ్ బీ, ఆర్. డబ్ల్యూ .ఎస్, పంచాయతీ రాజ్, డిప్యూటీ ఎంపిడిఓ అధికారులు ఆయా శాఖలకు సంబంధించి తీసుకుంటున్న ముందస్తు చర్యలు సమావేశంలో చర్చించారు. పాఠశాలలు, అంగన్వాడి సెంటర్లలోనూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖలకు సంబంధించిన అధికారులు వర్షాల నేపథ్యంలో రైతులు తీసుకోవాల్సి జాగ్రత్తలను వివరించారు. గూడూరు మండల జడ్పిటిసి సభ్యులు యామిని మాట్లాడుతూ ఆయా గ్రామ పంచాయతీలలో ఏదైనా సమస్యలు తలెత్తి వారి దగ్గర నిధులు తగినంతగా లేకపోతే తమ దృష్టికి తీసుకుని వస్తే పార్టీకి రహితంగా జిల్లా పరిషత్ చైర్మన్ తో మాట్లాడి తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటీసీలు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

కాళంగి వంతెన పరిశీలన

ప్రజాశక్తి -దొరవారిసత్రం :దొరవారిసత్రం మండల పరిధిలోని, తనయాలి గ్రామం వద్దఉన్న కాళంగి వంతెనను, సూళ్లూరుపేట ఆర్డిఓ కిరణ్మయి మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతు, 3 రోజులుగా కురుస్తున్న వర్షాలకు, వంతెన ఉధృతంగా, ప్రవహించే అవకాశం ఉందని తెలిపారు. ప్రజలకు రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలని ఆదేశించారు.

డ్రైవర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - వాకాడు: వాకాడు ఏపీఎస్ఆర్టీసీలో పల్లె వెలుగు బస్సులు నడు పుటకు 30 మంది ఆన్‌కాల్ డ్రైవర్లు కావాలని వాకాడు ఆర్టీసీ డిపో డిఎం తెలిపారు. అర్హత గల డ్రైవర్లు ధ్రువీకరణ పత్రాలతో డిపోలో సంప్రదించి పోస్టులు భర్తీ చేసుకోవాలని డిఎం తెలిపారు.

మురికివాడలను తలపిస్తున్న పట్టణ వీధులు

➤ అభివృద్ధికి ఆమడ దూరంలో నాయుడుపేట ➤ అధికారుల ఇష్టారాజ్యం ➤ అవినీతిపై తిరగబడితేనే అభివృద్ధి : సిపిఎం

ప్రజాశక్తి - నాయుడుపేట: అవినీతికి, అక్రమాలకు, దౌర్జన్యాలకు చిరునామాగా, అభివృద్ధి అనే పదానికి ఆమడ దూరంలో ప్రజలకు కనీసం కనిపించనంత చీకట్లో నాయుడుపేట రోజురోజుకి వెనుకబడిపోతోంది. తిరుపతి జిల్లా నాయుడుపేటను అధికారులు ఇష్ట రాజ్యంగా ఏలుకుంటున్నారు. వారికి నచ్చిన వారికి కాంట్రాక్టులు, వారికి సంబంధించిన వారు అక్రమాలకు పాల్పడుతుంటే సహకారాలు, అక్రమాలపై ఎవరైనా ప్రశ్నిస్తే అధికారుల పొంతనలేని నామమాత్రపు సమాధానాలు చెబుతూ విషయాన్ని దాటేస్తున్నారు. చుట్టుపక్కల కంపెనీలతో రోజురోజుకు పెరిగిపోతున్న నాయుడుపేటలో అవనీతీ, అక్రమాలు కూడా అదే స్థాయిలో పెరుగుతున్నాయి. ఇసుక, మట్టి అనుమతులు లేకుండానే ఎంతైనా ఎత్తుకోవచ్చు, ఎక్కడికైనా తోలుకో వచ్చు అడిగే నాధుడు ఉండడు. అభివృద్ధి పేరుతో చేసే పనులు నాలుగు రోజులకే పరిమితమవుతున్నాయి. కాంట్రాక్టర్లు స్వతంత్ర్యంగా వ్యవహరించుకోవచ్చు. లోడేసిన గుంటలను పూడ్చాల్సిన అవసరం లేదు. అడిగే నాధుడు లేడు. మునిసిపాలిటీలో పట్టణ ప్రణాళిక అధికారి ఉంటాడు కానీ ఆయన ఎవ్వరికీ కనిపించడు. ఆయన ఎక్కడ ఉంటారో కార్యాలయానికి ఎప్పుడు వస్తారో ఎవ్వరికీ తెలియదు. ప్రజలతో ఆయనకు ఎటువంటి సంబంధాలు ఉండవు. ఆయనకు ఉండే సంబంధాలన్నీ బిల్డర్లతో, అప్రూవల్ లేకుండా నిర్మాణాలు చేపడుతున్న ఇంటి యజమానులతో మాత్రమే అంతరంగిక సంబంధాలు కలిగి ఉంటాడని ఆయనపై ప్రధాన ఆరోపణ. నాయుడు పేట పట్టణంలో పెద్ద పెద్ద నిర్మాణాలు చేపట్టే ఏ ఒక్కరికి మునిసిపాలిటీ అనుమతులతో అవసరం లేదు. ఇవన్నీ చూస్తున్న నాయకులు వారు చేస్తున్న చిన్న చిన్న కార్యక్రమాలకు ఆడంబరాలు చేసుకోవడంలో మునిగితేలుతు న్నారు. తప్ప ఇక్కడున్న సమస్యలు వారి కంటికి కనిపిం చడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై నాయుడుపేట సిపిఎం నాయకులు శివకవి ముకుందా గతంలో ప్రజలతో కలిసి ఎన్నో కార్యక్రమాలు నిర్వహిం చిన ప్పటికీ ఏమాత్రం మార్పు కనిపించకపోవడం గమనార్హం.



అక్రమ తోలకాలు..



లోడేయ్యడమే తంతు



అనుమతుల్లేని కట్టడాలు

సిపిఎం,సిఐటియు నాయకులు స్పందిస్తూ..

నాయుడుపేట సమస్యలకు చిరునామాగా, అక్రమాలకు అడ్డాగా మారిందన్నారు. అధికారులు నాయకులకు అనుగుణంగా నడుచు కుంటూ వారి మెప్పుకోసం తహత హలాడుతూ వారి అక్రమాలకు అండగా నిలుస్తున్నారని దుయ్య బట్టారు. మున్సిపాలిటీ వీధులలో రోడ్లు మురికి నీటి కాలవలు ఘోరాతి ఘోరంగా మారాయని సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో సోమ వారం ప్రజలతో కలిసి ఆ వీధులలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ నాయకులు ఎస్.ముకుంద, సిఐటియు నాయకులు మస్తాన్ రెడ్డి మాట్లాడుతూ అవినీతితో నిండిపోయిన పాలనను అంతమొందించాలంటే ప్రజలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా మహిళలు ప్రశ్నించినప్పుడే అభివృద్ధి వస్తుందన్నారు. సిఐటియు నాయకులు సతీష్, ఎస్.కె అబ్దుల్లా మాట్లాడుతూ నాయుడుపేట మున్సిపాలిటీలో ఏ వీధిలో చూసిన రోడ్లు గుంతలుగా తయారై మురికి నీటి కాలవలోని నీరు రోడ్డుపై వర్షం గుంతలలో చేరి దుర్వాసన రేపుతూ చుట్టు పక్కల ఎవరు నివసించలేని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. నాయుడుపేట మున్సిపాలిటీకి దాదాపు గా రూ.6 కోట్ల ఆదా యం వస్తున్నా ఆ డబ్బు ఏమైపోతుందో తెలియని పరిస్థితి ఉందన్నారు. రోడ్లు, మురికి నీటి కాలువలు బాగు చేసే వరకు పోరాటాలు ఆపేదిలేదని తెలియజేశారు. హవాజ్ కమిటీ నాయకులు పలుమార్లు అధికారులకు రోడ్డు వేయమని అర్జీలు సమర్పించిన పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. ఎన్ని పోరాటాలు జరిగినా పై స్థాయి అధికారులు స్పందించి చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. ప్రజలను కేవలం ఆదాయపు వనరులు గానే చూస్తున్న అధికారుల్లో, రాజకీయ నాయకుల్లో మార్పు రావాలని లేకపోతే పోరాటాలు ఉధృతం చేస్తామని సిపిఎం నాయకులు హెచ్చరించారు.

క్రైం న్యూస్

కరెంట్ షాక్‌తో మహిళ మృతి

ప్రజాశక్తి -దొరవారిసత్రం: కరెంట్ షాక్ తగిలి మహిళ మృతి చెందిన ఘటన మండల పరిధిలోని కొత్తపల్లి హరిజనవాడలో చోటు చేసుకుంది. కొత్తపల్లి గ్రామానికి చెందిన గద్దం మల్లెమ్మ (60) ఇంటి తలుపు(రేకు) తీస్తుండగా, కరెంట్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మృతురాలి బంధువులు స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ అజయ్ కుమార్ ఘటన స్థలానికి చేరుకొని, వివరాలు తెలుసుకొన్నారు. మృతదేహాన్ని శవ పంచనామా నిమిత్తం నాయుడుపేట, ప్రభుత్వ హాస్పిటల్‌కి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కార్మికుడి దారుణ హత్య



హతుడు నారి నాయక్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్:పుత్తూరు పట్టణ పరిధి, ఈశ్వరాపురం గ్రామంలోని గ్రానైట్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న నారి నాయక్ (45) హత్యకు గురయ్యాడు. మృతుడు ఒడిశా రాష్ట్రం, బరంపూర్ పరిధిలోని గంజాం జిల్లా అటపాడ ప్రాంతానికి చెందినవాడు. హత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. ఘటనపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

గుర్తు తెలియని వాహనం ఢీ.. మహిళ మృతి



ప్రజాశక్తి - చంద్రగిరి:చంద్రగిరి మండలం, మామండూరు సర్వీస్ రోడ్డులో భిక్షాటన చేసుకుంటూ జీవనం గడిపే ఒక మహిళను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ప్రమాదంపై సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది గాయపడిన వృద్ధురాలిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆమె మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతురాలి వివరాలు ఇంకా తెలియరాలేదు. చంద్రగిరి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

పోటెత్తిన ఓటేరు కాల్వ

ఇళ్లల్లోకి మురుగునీరు.. పట్టించుకోని ప్రభుత్వ యంత్రాంగం



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పట్టణంలోని ప్రధాన మురుగు నీటి కాలువ ఓటేరు పోటెత్తి ప్రవహిస్తోంది. దీంతో పరీవాహక లోతట్టు వీధులు ముంపునకు గురయ్యాయి. ఇళ్లల్లోకి మురుగు, వరద నీరు చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దుర్గంధం భరించలేక అల్లాడిపోయారు. నిత్యావసరాలకు సైతం బయటకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. ముంపునీటితో ఓటేరు పరీవాహక ప్రజలు అల్లాడిపోతున్నా అధికార యంత్రాంగం నుంచి కనీసం స్పందన లేకపోవడంపై తీవ్ర స్థాయిలో విమర్శలు వ్యక్తమయ్యాయి. ఓటేరు వరద, ముంపు దృశ్యాలు మంగళవారం సోషల్ మీడియాలో వైరల్ అయినా అధికారుల్లో చలనం రాకపోవడంపై బాధిత ప్రజలు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు.

సరైన ప్రణాళిక లేకపోవడమే..!!

భారీ వర్షాలు పడ్డ ప్రతిసారీ ఓటేరుకు వరద రావడం, పరీవాహక లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురికావడం వెనక అధికారుల ప్రణాళికా లోపం ఉందని విమర్శలు తలెత్తుతున్నాయి. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకోకుండా.. అప్పటి అవసరాలకనుగుణంగా కాలువను నిర్మించారనీ, ప్రస్తుతం లక్షకు పైగా జనాభా ఉండడంతో సామర్థ్యం సరిపోవడం లేదంటున్నారు. అప్పట్లో కేవలం 25 ఏళ్లకు సరిపడా ప్రణాళికతో కాలువను నిర్మించారనీ, కాలువ నిర్వహణ కూడా సక్రమంగా నిర్వర్తించపోవడంతో పరీవాహక ప్రజలకు ముంపు ముప్పు తప్పడం లేదని వాపోతున్నారు. భవిష్యత్తులోనైనా పట్టణ ప్రధాన మురుగు నీటి కాలువను ఆధునీరించకపోతే పెనుప్రమాదం తప్పదని హెచ్చరిస్తున్నారు. ఇప్పటి, అప్పటి పాలకులు సైతం ఓటేరును ఉద్ధరించామని మాటలు చెప్పడం తప్పా, వాస్తవిక పరిస్థితుల్లోకి వెళితే అంతా మిథ్యేనని ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు.


పుణ్యక్షేత్రం జలమయం .. ప్రవాహంలో కొట్టుకెళ్లిన ఫ్రిజ్

ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీకాళహస్తి పట్టణం భారీ వర్షాలకు అతలాకుతలమైంది. మంగళవారం కురిసిన భారీ వర్షానికి రోడ్లు, వీధులు జలమయమయ్యాయి. వీధుల్లో భారీగా వరద నీరు చేరడంతో కాలువల్లా ఉప్పొంగి ప్రవహించాయి. పెద్ద మసీదు వీధిలో రిపేరుకు ఇచ్చిన ఓ రిఫ్రిజిరేటర్ వరద ప్రవాహం ధాటికి వీధిలో కొట్టుకుపోవడం కనిపించింది.

పండగల్లో పెద్దాస్పత్రికి సెలవ్.. ఆపదొస్తే వైద్యులుండరు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : తూర్పు మండలాల పేద ప్రజలకు పెద్దదిక్కుగా ఉన్న శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రి వైద్యుల తీరు నానాటికీ తీసికట్టుగా మారుతోంది. ఓపి సమయం ముగిసిందంటే అత్యవసర వైద్యం అందని ద్రాక్షగా మారుతోంది. క్యాజువాలిటీ విభాగంలో డ్యూటీ చేసే కొందరు వైద్యులకు సొంత క్లినిక్‌లు, ప్రైవేటు ఆసుపత్రుల్లో ప్రాక్టీస్ ఉండడంతో అత్యవసర వైద్యం అందించేందుకు అందుబాటులో ఉండడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. పండగలు వస్తే ఆస్పత్రికి సెలవు అన్నట్లుగా వ్యవహరించే పరిస్థితి ఏర్పడుతోంది. దీంతో రోడ్డు ప్రమాదాలకు గురై చికిత్స నిమిత్తం ఆసుపత్రికి వచ్చే క్షతగాత్రులకు నర్సులు, పీజీ డాక్టర్లే వైద్యం అందిస్తున్నారు. దీపావళి పర్వదినం(సోమవారం) నాడు చిత్తూరు జిల్లా సిపిఎం కార్యదర్శి వాడ గంగరాజు తన కుమార్తెతో పాటు ద్విచక్ర వాహనంలో వెళ్తూ బంగారమ్మ గుడి వద్ద రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. ఈ ప్రమాదంలో ఇరువురికి గాయాలయ్యాయి. వీరిని మధ్యాహ్నం రెండున్నర గంటలకు ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడ వైద్యులు కానరాని పరిస్థితి దర్శనమిచ్చింది. డ్యూటీలో ఉన్న ఓ వైద్యుడు సాయంత్రం ఐదు గంటలకు ఆసుపత్రికి వచ్చారు. తనకే ఈ పరిస్థితి ఎదురైతే ఇక సామాన్యుల పరిస్థితి ఏంటని సిపిఎం చిత్తూరు జిల్లా కార్యదర్శి గంగరాజు వాపోయారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నత వైద్యాధికారులు స్పందించి ఏరియా ఆసుపత్రికి వచ్చే క్షతగాత్రులకు అన్నివేళలా అత్యవసర వైద్యం అందేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పారిశుద్ధ్య కార్మికులకు దీపావళి కానుక పంపిణీ



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మంగళం పరిధిలోని న్యూ మంగళం గ్రామపంచాయతీలో పారిశుద్ధ్య కార్మికులకు చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే పులివర్తి నాని ఆదేశాల మేరకు దీపావళి కానుకగా నిత్యవసర వస్తువుల ను స్థానిక టిడిపి కమిటీ అధ్యక్షు లు వేమూరు గోపాల్ యాదవ్ అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ టిడిపి ప్రధాన కార్యదర్శి మునయ్య, మాతయ్య, రోసిరెడ్డి, గురవయ్య, మురగ రెడ్డి, వేమూరు గురవయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

జెసిబితో వరద నీరు మళ్లింపు

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి రూరల్(తొట్టంబేడు): గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని పలు గ్రామాలలో ఇళ్లల్లోకి నీళ్లు చేరి ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్లపైకి నీరు చేరడంతో ప్రజల జీవనం స్తంభించింది. మండలంలోని రౌతు సూరమాల గ్రామంలోనీ పలు ఇళ్లల్లోకి వర్షపు నీరు చేరి ప్రజలు ఇబ్బందులు పడుతుండడంతో ఎంపీడీవో సురేంద్రనాథ్ రౌతు సూరమాల గ్రామానికి చేరుకొని ఇళ్లల్లోకి చేరిన వర్షపు నీటిని జెసిబి సహాయంతో కాలువలను తీసి ఆ వర్షపు నీరు కాలువల ద్వారా బయటకు వెళ్లే విధంగా చేశారు. మండల తహశీల్దార్ భారతి అన్ని శాఖల అధికారులను అప్రమత్తం చేశారు.

రాజగోపాల్ నాయుడుకు నివాళి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: చిత్తూరు జిల్లా తవణంపల్లి మండలం దిగువమాఘం గ్రామంలో మాజీ ఎంపీ పాటూరు రాజగోపాల్ నాయుడు 28వ వర్ధంతి సందర్భంగా ఘనంగా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అమర రాజా వ్యవస్థాపక చైర్మన్ గల్లా రామచంద్ర నాయుడు, మాజీ మంత్రివర్యులు గల్లా అరుణ కుమారి , అమర హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డా. రమాదేవి , అమర రాజా కంపెనీ చైర్మన్ గల్లా జయదేవ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విక్రమాదిత్య గౌరినేని రాజన్న మెమోరియల్ పార్క్ వద్ద రాజగోపాల్ నాయుడు విగ్రహానికి పూలమాలలు సమర్పించి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో దిగువమాఘం సర్పంచ్ గోపి , మాజీ సర్పంచ్ కుమార్ నాయుడు , రాజన్న ఫౌండేషన్ నిర్వాహకులు సతీష్ రాళ్లపల్లి గ్రామస్థులు పాల్గొన్నారు.

టమోటా లారీ బోల్తా

ప్రజాశక్తి - చంద్రగిరి: మదనపల్లి – తిరుపతి హైవే భాకరాపేట ఘాట్ రోడ్డులో కలకడ నుంచి టమోటా లోడ్‌తో విశాఖపట్నం వెళుతున్న లారీ అదుపుతప్పి బోల్తా పడింది. లారీలో ఉన్న వారికి ఎటువంటి ప్రమాదం జరుగలేదు. డ్రైవర్ ప్రసాద్, ఓనర్ నాగేశ్వర, షేక్ నాగులు చిన్న చిన్న గాయాలతో సురక్షితంగా బయటపడ్డారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విలీనానికి వ్యతిరేకంగా మౌన దీక్ష

వేడాం విద్యార్థులు, తల్లిదండ్రుల వినూత్న నిరసన



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: విలీనం ఆపాలంటూ శ్రీకాళహస్తి రూరల్ మండలంలోని వేడాం పెద్ద మిట్టకండ్రిగకు చెందిన ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాఠశాలకు తాళం వేసి మంగళవారం శ్రీకాళహస్తి ఎంపిడీవో, ఎంఈఓ కార్యాలయాల వద్ద మౌన దీక్ష చేపట్టారు. విలీన ప్రక్రియ ఆపాలని గత మూడు నెలలుగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు రాజీలేని పోరాటం చేస్తున్నా ప్రభుత్వానికి కనీస చలనం లేకుండా పోయిందంటూ బాధితులు వాపోయారు. వందేళ్ళ చరిత్ర కలిగిన పెద్ద మిట్టకండ్రిగ పాఠశాలను రెండు కిలోమీటర్ల అవతల ఉన్న చిన్న మిట్టకండ్రిగ పాఠశాలలో విలీనం చేస్తే విద్యార్థులకు వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు ఉంటాయని తల్లిదండ్రులు వాపోయారు. విద్యార్థులు వద్దంటున్నా, తల్లిదండ్రులు ససేమిరా అంటున్నా ప్రభుత్వానికి ఎందుకింత మొండి పట్టని ప్రశ్నించారు. విలీనానికి వ్యతిరేకంగా తిరగబడ్డ చాలాచోట్ల ప్రభుత్వం వెనక్కి తగ్గిందనీ, అయితే వందేళ్ళ చరిత్ర కలిగిన ప్రభుత్వ పాఠశాలను మూసివేసేందుకు ఎందుకు కంకణం కట్టుకుందని నిలదీశారు. మా పిల్లలను ఇంట్లోనైనా కూర్చోబెడతాం కానీ, విలీనబడికి మాత్రం పంపమని స్పష్టం చేశారు. ప్రభుత్వం దిగొచ్చేంత వరకు పోరాటం ఆగదని హెచ్చరించారు. అనంతరం ఎంపీడీవో, ఎంఈఓ కు వినతి పత్రం అందజేశారు.

అమరవీరులకు ఘన నివాళి : కలెక్టర్, ఎస్పీ



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక టాస్క్ ఫోర్సు (ఆర్ఎస్ఎ ఎస్టీఎఫ్) కార్యాలయంలో టాస్క్ ఫోర్స్ హెడ్ ఎల్.సుబ్బారాయుడు సూచనల మేరకు మంగళవారం అమర వీరులకు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమం లో డీఎస్పీ ఎండీ షరీఫ్, ఆర్ఐ సాయి గిరిధర్, ఆర్ఎస్ఐ విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి -దొరవారిసత్రం :దొరవారిసత్రం మండల కేంద్రంలో ఎస్ఐ అజయ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేమన్నారు.


ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ:మండలంలోని పోలీస్ స్టేషన్‌లో మంగళవారం సబ్ ఇన్స్పెక్టర్ హరిప్రసాద్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది అమరవీరుల సంస్కరణ దినోత్సవం నిర్వహించారు. సబ్ ఇన్స్పెక్టర్ హరిప్రసాద్ మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకోవాలన్నారు.

ప్రజాశక్తి - తిరుపతి సిటీ:తిరుపతి జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం తిరుపతిలోని ఆర్మ్డ్ రిజర్వ్ పోలీస్ గ్రౌండ్స్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ యల్.సుబ్బరాయుడు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అమరవీరుల స్మారక స్థూపం వద్ద పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది సమాజ భద్రతకు రక్షణ కవచం లాంటివారన్నారు. ఎస్పీ సుబ్బరాయుడు మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు విధి నిర్వహణలో అశువులు బాసిన 25 మంది పోలీస్ సిబ్బంది త్యాగం చిరస్మరణీయమన్నారు. ఈ కార్యక్రమంలో అమరులైన పోలీస్ సిబ్బంది కుటుంబ సభ్యులను జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ సన్మానించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు వెంకట్రావు, రవి మనోహరాచారి, నాగభూషణరావు, ఇంటిలిజెన్స్, జిల్లా పోలీస్ అధికారులు, సివిల్ అధికారులు, పోలీస్ సిబ్బంది, పోలీస్ అమరవీరుల కుటుంబ సభ్యులు, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్: పోలీసు అమరవీరుల త్యాగాలు అమూల్యమని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని బాలికల గురుకుల పాఠశాలలో పోలీస్ శాఖ నిర్వహించిన పోలీసు అమరవీరుల దినోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

ఘనంగా దీపావళి సంబరాలు

బర్డ్ ఆసుపత్రిలో..



ప్రజాశక్తి - తిరుపతి సిటీ: టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న బాలాజీ వికలాంగుల పునరావాస, పరిశోధన కేంద్రం (బర్డ్) ఆసుపత్రిలో దీపావళి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా బర్డ్ డైరెక్టర్ డాక్టర్ గుడారు జగదీష్ మాట్లాడుతూ ఇక్కడ ఉన్న చిన్నారులతో, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పేషంట్లలో దీపావళి పండుగ జరుపుకోలేక పోయామన్న బాధను పోగొట్టడం ఈ వేడుక ముఖ్యోద్దేశ్యమన్నారు.

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్ : దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని వెంకటగిరిలోని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ నివాసంలో దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించారు. నాయకులు, ప్రజలు ఈ వేడుకల్లో పాల్గొని ఎమ్మెల్యేకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

తులకోనలో..

ప్రజాశక్తి - యర్రావారిపాలెం: శ్రీ తలకోన సిద్దేశ్వర ఆలయంలో సోమవారం దీపావళి సంబరాలు ఘనంగా నిర్వహించారు. చడం జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమావాస్య కేదారేశ్వర గౌరీ వ్రతములు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాలక మండల సభ్యులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దీపావళి సంబరాలు జరుపుకున్నారు.

మినీ గురుకులంలో..

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : శ్రీ కృష్ణ సేవా సంస్థ అధ్యక్షుడు తిరుపతి జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ బండి.శ్యామసుందరరావు (మయూరి శ్యామ్ యాదవ్) దాతృత్వంతో ఆంధ్రప్రదేశ్ గిరిజన గురుకుల పాఠశాల(మినీ గురుకులం)లో దీపావళి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మయూరి శ్యామ్ యాదవ్, ఉపాధ్యాయునులు అంకమ్మ, చంద్ర, విద్యార్థునులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రానైట్ క్వారీలు రద్దు చేయాలి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణ పరిధిలోని ఈసలాపురం గ్రానైట్ క్వారీలను రద్దు చేయాలని సిపిఎం పార్టీ కార్యదర్శి ఆర్ వెంకటేష్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ క్వారీలో పనిచేస్తున్నట ఒడిశా రాష్ట్రానికి చెందిన నాయక్ అనే కార్మికుడిని హత్య చేయడం దారుణమన్నారు. గతంలో కూడా ఇదే గ్రానైట్ క్వారీల్లో ఎస్టీ బాలుడి పై బాంబు పేలడంతో తల పైన తీవ్ర గాయాలు గురై అస్వస్థలకు గురయ్యాడన్నారు. ఇది జరిగి నాలుగు నెలలకు గడక ముందే ఇపుడు కార్మికుడు హత్యకు గురికావడం దారుణమన్నారు. గ్రానైట్ పేలుళ్లతో పరిసర ప్రాంత నివాసాల్లో వస్తువులు, గోడలు దెబ్బతింటున్నాయన్నారు. ఇపుడు జరిగిన హత్యలో నేరస్తుడిని వెంటనే పట్టుకోవాలని, బాధిత కుటుంబానికి రూ.30 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. హతుడి కుటుంబానికి న్యాయం జరగకపోతే సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు.

పేద కుటుంబాలకు చేయూత

ప్రజాశక్తి - వాకాడు:తిరుపతి జిల్లా, వాకాడు మండలం, బాలిరెడ్డిపాళెం, శ్రీ పట్టాభిరామాలయం కేంద్రంగా నడపబడుతున్న శ్రీ సీతారామ థార్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రవాస భారతీయులు రామిరెడ్డి వేంకట రామిరెడ్డి, హైమావతమ్మ దంపతుల ఆర్థిక సౌజన్యంతో నాలుగు పేద కుటుంబాలకు 55వేల రూపాయలను మాజీ సొసైటీ చైర్మన్, ఆలయ ధర్మకర్త కొడవలూరు దామోదర్ రెడ్డి ఆన్ లైన్ ద్వారా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దామోదరరెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాంతమే కాకుండా చెన్నైకి చెందిన సుమతమ్మ, పల్నాడు జిల్లాకు చెందిన అగ్నిహోత్రం సువర్ణ లక్ష్మి, కృష్ణా జిల్లాకు చెందిన వినుకొండ విజయ రామాచార్యులు, నెల్లూరు జిల్లాకు చెందిన ఉదయగిరి గోపికృష్ణ లకు 55వేల రూపాయలను దాతల ద్వారా ఈరోజు అందజేయడం చాలా సంతోషమన్నారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులను, దాతలను ప్రత్యేకంగా అభినందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో శ్రీరామసేన అధ్యక్ష, కార్యదర్శులు కొడవలూరు హరీష్ రెడ్డి,పోలిపాటి శివకుమార్, వంశీ, వినయ్,సంస్థ ప్రతినిధి దీవి అనంతబాబు తదితరులు పాల్గొన్నారు.

ఔషధ మొక్కలపై ఉపాధి కోర్సులు

ప్రజాశక్తి - క్యాంపస్ :యస్వీయులో ఔషధ మొక్కల పెంపు, హెర్బల్ చికిత్సలపై ఉపాధి కోర్సులను ప్రవేశపెట్టనున్నారు. వచ్చే విద్యా సంవత్సరంలోపు రెండేళ్ల పీజీ కోర్సు, ఏడాది పీజీ డిప్లమో కోర్సుల ప్రారంభం దిశగా కసరత్తు మొదలైంది. ఈ మేరకు మంగళవారం ఆంధ్రప్రదేశ్ ఔషధ మొక్కలు, సుగంధ ద్రవ్యాల బోర్డు ముఖ్య కార్యనిర్వహణాధికారి ఆవుల చంద్రశేఖర్ యూనివర్సిటీని సందర్శించారు. ఎస్వీయూ ప్రాంగణంలో ఔషధ మొక్కల నర్సరీని పెంచడానికి రూ. 6.50 లక్షల నిధులను విడుదల చేసినట్లు బోర్డు సిఈఓ ఆవుల చంద్రశేఖర్ ప్రకటించారు.

పరీక్షల విభాగం పనితీరుపై విసి సమీక్ష

ప్రజాశక్తి - క్యాంపస్ :యస్వీయు ఉపకులపతి ఆచార్య తాతా నరసింగరావు మంగళవారం తన ఛాంబర్‌లో పరీక్షా విభాగం ముఖ్య సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి, వారి పనితీరును సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ, పరీక్షా విభాగం విశ్వవిద్యాలయ విద్యా పరిపాలనకు వెన్నెముకని, విద్యార్థుల సంతృప్తిని నిర్ధారించడంలో, ఖ్యాతిని నిలబెట్టడంలో కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. నిర్ణీత సమయంలో ఫలితాలు విడుదలయ్యేలా చూసుకోవడానికి, పెండింగ్‌లో ఉన్న అన్ని పనులను వేగవంతం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. పనిలో నిర్లక్ష్యం సహించబోమని స్పష్టం చేశారు.

దేవాలయ భూములు వేలం

ప్రజాశక్తి - వాకాడు: వాకాడు మండల కేంద్రం, వాకాడులోని ఆలయ భూములను దేవాదాయ శాఖ సిబ్బంది ఆధ్వర్యంలో మూడు మండలాల పోలీస్ సిబ్బంది సహకారంతో 79.95ఎకరాలకు వేలం పాట నిర్వహించారు. ఈ వేలంపాటలో 108 మంది పాల్గొనగా 39 మంది భూములను వేలంపాట ద్వారా మూడు సంవత్సరాలు కౌలు పట్టా పొందారు. గత సంవత్సరం ఇదే భూమికి 5 లక్షల ఇరవై ఎనిమిది వేలు లీజు సొమ్ము రాగా, ఈ సంవత్సరం 14,40,000 సొమ్ము దేవాలయాలకు దక్కింది. ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ డీఈవో పి రామకృష్ణారెడ్డి, ఈవో ఎం రవికృష్ణ, దేవాదాయ ఇన్స్పెక్టర్ ఎం సుధీర్, కోట ఎస్సై పవన్ కుమార్, వాకాడు ఎస్సై నాగబాబు,చిట్టమూరు ఎస్సై చిన్న బలరామయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ్‌కు డాక్టరేట్



ప్రజాశక్తి - క్యాంపస్ : జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం మీమాంస శాస్త్రం పరిశోధక విద్యార్థి కె.శ్రీరామ్‌కు డాక్టరేట్ డిగ్రీ ప్రదానం చేసినట్లు ఇన్చార్జి సిఈ ప్రొ.ఎ.సచ్చిదానందమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. మీమాంసా విభాగం ఆచార్యులు ప్రొ.టి.ఎస్.ఆర్. నారాయణ మార్గదర్శకత్వంలో "మీమాంసా శాస్త్రంలో సామవిచారము" అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని వర్సిటీకి సమర్పించారు. ఇందుకుగాను శ్రీరామ్ కు డాక్టరేట్ డిగ్రీ అవార్డు ప్రదానం చేసినట్లు వివరించారు. ఈ సందర్భంగా పలువురు ఆచార్యులు, పరిశోధకులు, అభినందనలు తెలిపారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం



ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి అలిపిరి రోడ్డులోని రుయా హాస్పిటల్ ప్రాంగణం వద్ద లయన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి శ్రీశ్రీనివాస అధ్వర్యంలో దీపావళి సందర్భంగా రుయా హాస్పిటల్‌కు వచ్చు అనాధలకు, రోగులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ చైర్పర్సన్ ఆర్కాట్ కృష్ణప్రసాద్ విచ్చేశారు. సుమారు 500 మందికి అన్నదానం చశారు. ఈ సందర్భంగా లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ చైర్పర్సన్ ఆర్కాట్ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ దానల్లో గొప్పదానం అన్నదానం అని, దీపావళి పండుగరోజున లయన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి శ్రీశ్రీనివాసా అధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు బెల్లంకొండ సురేష్, శాంతి నాడార్ , శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐ హరిప్రసాద్‌కు సన్మానం



ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలో నూతన సబ్ ఇన్స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన హరిప్రసాద్‌ను మంగళవారం అడ్వకేట్ రాజా, వారి గ్రూపు సభ్యులు కిషోర్ రాబర్ట్, డిగ్రీ కాలేజ్ లెక్చరర్ సురేష్, ఎన్టీఆర్ నగర్ యూత్ లీడర్ పురుషోత్తంలు కలిసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాజా మాట్లాడుతూ ఎస్ఐ ప్రసాద్ విదులపట్ల నిబద్ధతను కొనియాడారు.

ఎస్ఐని సన్మానించిన మండల టిడిపి నాయకులు

ఎస్ఐ హరి ప్రసాద్‌ను మండల టిడిపి నాయకులు ముని చంద్ర నాయుడు, మాజీ జడ్పిటిసి వీరరాఘవులు, సముద్రాల రవి నాయుడు, కార్తీక్ చౌదరి, తుమ్మల రాజేందర్ నాయుడు, వెంకటరత్నం, మాజీ ఎంపీటీసీ లోకయ్య, టిడిపి నాయకులు మంగళవారం సన్మానించారు.

శ్రీకపిలేశ్వరాలయంలో కార్తీకమాస హోమ మహోత్సవాలు



ప్రజాశక్తి - తిరుపతి టౌన్: పవిత్రమైన కార్తీక మాసాన్ని పురస్కరించుకుని లోక కల్యాణం కోసం తిరుపతిలోని శ్రీకపిలేశ్వరస్వామి వారి ఆలయంలో అక్టోబర్ 22 సోమవారం నుంచి నవంబరు 20వ తేదీ వరకు నెల రోజుల పాటు విశేషపూజ హోమ మమోత్సవాలు జరుగనున్నాయి. సోమవారం హోమ మమోత్సవాలకు శాస్త్రోక్తంగా అంకురార్పణ జరుగనుంది. అక్టోబరు 22 నుంచి 23వ తేదీ వరకు మొదటగా శ్రీగణపతిస్వామివారి హోమం, అక్టోబరు 24 నుండి 26వ తేదీ వరకు శ్రీసుబ్రమణ్యస్వామివారి హోమం, అక్టోబరు 27న శ్రీదక్షిణామూర్తి స్వామివారి హోమం, అక్టోబరు 28న శ్రీ నవగ్రహ మోమం జరుగనున్నాయి. అదేవిధంగా అక్టోబరు 29న శ్రీకాలభైరవ స్వామివారి హోమం, అక్టోబరు 30 నుంచి నవంబరు 7వ తేదీ వరకు శ్రీ కామాక్షి అమ్మవారి హోమం(చండీ హోమం), నవంబరు 8 నుంచి 18వ తేదీ వరకు శ్రీ కపిలేశ్వర స్వామివారి హెూమం(రుద్ర హోమం), నవంబరు 19న ధర్మశాస్త్ర హోమం, నవంబరు 20న శ్రీచండికేశ్వరస్వామివారి హోమం, త్రిశూలస్నానం, పంచమూర్తుల తిరువీధి ఉత్సవం నిర్వహించనున్నారు. గృహస్తులు (ఇద్దరు) రూ.500/- చెల్లించి ఒక రోజు హోమంలో పాల్గొనవచ్చు. గృహస్తులకు ఒక ఉత్తరీయం, ఒక రవికె, అన్నప్రసాదం అందజేస్తారు. ఈ హోమాల్లో పాల్గొనే గృహస్తులు కచ్చితంగా సంప్రదాయ వస్త్రధారణలో రావాల్సి ఉంటుంది. ఈ హోమాల్లో భాగంగా అక్టోబరు 27న శ్రీ వల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రమణ్యస్వామివారి కల్యాణం, నవంబరు 18న మాస శివరాత్రి నాడు శ్రీ శివపార్వతుల కల్యాణోత్సవం జరుగనున్నాయి. గృహస్తులు (ఇద్దరు) రూ.500/- చెల్లించి ఒక్కో కల్యాణంలో పాల్గొనవచ్చు.

తుమ్మలగుంటలో.. అట్టహాసంగా నరకాసుర వధ



ప్రజాశక్తి - తిరుపతి సిటీ: రకరకాల టపాకాయల మోతలు.. రంగురంగుల వెలుగులతో కళ్ల మిరమిట్లు గొలిపేలా కాంతులు.. దిక్కులు పిక్కటిల్లేలా టాపాసుల శబ్ధాలు.. భక్తుల కోలాహలం మద్యన కళ్లెదుటే నరకాసురుడి దహనం.. ఇళ్ల ముంగిట దీపపు కాంతులతో తుమ్మలగుంటలో నరక చతుర్ధశి వేడుకలు సోమవారం అత్యంత వేడుకగా జరిగాయి. చంద్రగిరి నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ప్రతి ఏటా కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద నరక చతుర్ధశి రోజున నరకాసురవధ నిర్వహించడం ఆనవాయితీ. గత 18ఏళ్లుగా జరిపించే ఆ నరకాసుర వధ కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో 52 రకాలతో కూడిన 2 లక్షల టపాకాయలను ఉపయోగించి, నరకాసురుని ప్రతిమను ఆకట్టుకునేలా తయారు చేశారు. 20 అడుగుల ఎత్తు, 5 అడుగుల వెడల్పుతో తమిళనాడు రాష్ట్రం శివకాశి నుంచి వచ్చిన 10 మంది కార్మికులు ప్రత్యేకంగా తెప్పించిన టపాకాయలతో నరకాసురుడి ప్రతిమను రూపొందించారు. ఆ ప్రతిమను తయారు చేయడానికి 7రోజుల పాటు శ్రమించి తయారు చేశారు. ఆలయం ముందు నరకాసురుని ప్రతిమను నిలబెట్టి ముందుగా పూజలు చేసిన తరువాత చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి చేతులు మీదుగా నరకాసురుని ప్రతిమ దహనానికై దీపంతో ముట్టించారు. ఈ కార్యక్రమంలో చెవిరెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మీ, వైఎస్ఆర్‌సీపీ జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షులు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి, చెవిరెడ్డి రఘునాథరెడ్డి, తిరుపతి రూరల్ ఎంపీపీ మూలం చంద్రమోహన్ రెడ్డి, తుమ్మలగుంట గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ జయచంద్రా రెడ్డి, కిరణ్‌కుమార్ రెడ్డి, వైఎస్ఆర్‌సీపీ నేతలు తులసీరెడ్డి, గణపతిరెడ్డి, బుజ్జిబాబులతో పాటు పెద్ద ఎత్తున జనం తరలివచ్చారు.

చెడుపై సాధించిన విజయానికి ప్రతీకగా...

చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా దీపావళిని జరుపుకుంటున్నారని తుడా మాజీ ఛైర్మన్, వైఎస్ఆర్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గం సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. ఆలయం నిర్మించినప్పటి నుంచి ప్రతి ఏటా ఆలయం వద్ద ఘనంగా దీపావళి పండుగ వేడుకలను నిర్వహిస్తున్నామన్నారు. దీపావళి పర్వదినాన ప్రజలందరికీ నరకాసురవధ ఎందుకు జరిగింది, ఎలా జరిగిందన్న విషయాలను తెలియపరచడానికి ఈ ఘట్టం ఉపయోగ పడుతుందన్నారు. ప్రతి ఏటా జరిగే దీపావళి వేడుకల్లో ప్రజలందరితో సంతోషంగా గడిపే, తన తండ్రి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిపై కూటమి ప్రభుత్వం రాజకీయ కక్షకట్టి, అక్రమ కేసులో 125 రోజులుగా జైలులో నిర్భంధించడం తమ మనసును బాధిస్తోందని చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆవేదనను వ్యక్తం చేశారు. దీపావళి పండుగ వేళ ఆయనను జనం మద్యన లేకుండా చేశారన్న బాధ తప్ప ఆయన ఆదేశాలతో ఆలయం వద్ద ఏలాంటి కార్యక్రమాలు ఆగకుండా నిర్విఘ్నంగా పూర్తి చేస్తున్నామన్నారు. అంతకు ముందుగా తమ ఇంటి వద్ద ఆయుధపూజను ఘనంగా నిర్వహించిన చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డిలు వాహనాలకు హారతులు పట్టి ముందుకు కదిలించారు.

వేద పాఠశాలలో దీపావళి సంబరాలు

శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంకు అనుబంధంగా నడిపే వేదపాఠశాలలో చెవిరెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మీ, కుమారులు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డిలు ప్రత్యేకంగా అక్కడి పిల్లల చేత టపాకాయలు పేల్చి సంబరాలు జరిపారు. ప్రతి ఏటా చెవిరెడ్డి పిల్లలతో కలసి టపాకాయలు కాల్పించే వారని, ఈ ఏడాది ఆయన అందుబాటులో లేనందున చెవిరెడ్డి కుటుంబీకులు ఆ కార్యక్రమాన్ని నిర్విఘ్నంగా పూర్తి చేశారు.

భక్తిశ్రద్ధలతో కేదారేశ్వర వ్రతం



ప్రజాశక్తి - రామచంద్రాపురం : మండలంలో దీపావళి సందర్భంగా మహిళలు భక్తిశ్రద్ధలతో కేదారేశ్వర వ్రత పూజలు నిర్వహించారు. మంగళవారం మధ్యాహ్నం వరకు అమావాస్య ఘడియలు ఉండడంతో మహిళలు మధ్యాహ్నం 12 గంటల లోపే కేదారేశ్వర వ్రత పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మండలంలోని అనుపల్లి, నడవలూరు, కమ్మపల్లి, సి రామాపురం, ఎన్ఆర్ కమ్మపల్లి, రాయల చెరువు, గ్రామాలలో దేవాలయాల ఆవరణంలో పసుపు ముద్దతో ధనలక్ష్మి దేవి ప్రతిమణం ప్రతిష్ట చేసి, బంగారు ఆభరణాలు, పట్టు వస్త్రాలు, వివిధ పుష్పాలతో విశేషంగా అలంకరించారు. అర్చకులు వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ అమ్మవారికి ధూపదీప నైవేద్యాలు సమర్పించి కేదారేశ్వర వ్రతాన్ని శాస్త్రోత్తంగా నిర్వహించారు. అనంతరం కేదారేశ్వర వ్రతం నిర్వహించడం వల్ల జరిగే మంచి గురించి కేదారేశ్వర వ్రత కథను మహిళలకు చదివి వినిపించారు. అమ్మవారి వ్రత కంకణాలను చేతికి కట్టుకుని మొక్కులు తీర్చుకున్నారు.

చంద్రగిరి పోలీస్ స్టేషన్లో ఆయుధ, వాహన పూజలు



ప్రజాశక్తి - చంద్రగిరి: మండల కేంద్రమైన చంద్రగిరి పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఆయుధపూజ ఘనంగా నిర్వహించారు. చంద్రగిరి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఇమ్రాన్ ఖాన్ ఆధ్వర్యంలో దసరా, దీపావళి పండుగలను పురస్కరించుకొని భక్తిశ్రద్ధలతో వేడుకలు నిర్వహించినట్లు తెలియజేసారు. స్థానిక పోలీస్ స్టేషన్ లోని వాహనాలు, బైక్‌లు, కంప్యూటర్లు, తుపాకులు, ఇతర వస్తువులను పేద పండితుల మంత్ర ఉచ్చారణతో పూజలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ ఏడాది మండల పరిసర ప్రాంతాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా సామరస్యమైన జీవితాన్ని ప్రజలు గడపాలని కోరి మండల ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ లు, ఏఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్స్, ,పోలీస్ సిబ్బంది, డ్రైవర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులను మోసం చేస్తున్న వ్యక్తి అరెస్ట్



ప్రజాశక్తి - తిరుమల: శ్రీవారి భక్తుల నుండి రూ.4,01,750 కాజేసిన మోసగాడిని తిరుమల పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల తెలిపిన వివరాల మేరకు చంద్రగిరి, పాతపేట నివాసితుడు అశోక్ అలియాస్ అశోక్ రెడ్డి అను వ్యక్తి తనకు రాజకీయ నాయకులు, టీటీడీ అధికారులతో పరిచయాలు ఉన్నాయని భక్తులను నమ్మించి, బ్రేక్ దర్శన టికెట్లు, అభిషేకాలు ఇప్పిస్తానని భక్తుల వద్ద నగదు కాజేసి వాడని తెలిపారు. అనంతరం తన ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి ఉడాయించేవాడని తెలిపారు. ఫోన్ పే, గూగుల్ పే ద్వారా భక్తుల వద్ద నుంచి భారీ వసూళ్లు చేసేవాడని తెలిపారు. బాధితులు అమన్ గోయల్, గౌతమ్ గుప్తా, రాధిక అగర్వాల్, గోపాల్ అగర్వాల్, బాలకృష్ణల వద్దనుండి రూ.4,01,750 వసూలు చేసినట్లు తెలిపారు. బాధితులు టీటీడీ విజిలెన్స్ వారికి ఫిర్యాదు చేయడంతో, తిరుమల టూ టౌన్, వన్ టౌన్ పోలీస్ స్టేషన్లలో చీటింగ్ కేసులు నమోదు చేశామన్నారు. ఈ సందర్భంగా తిరుమల డిఎస్పి విజయ శేఖర్ దళారీల మాటలు నమ్మవద్దని, టిటిడి అధికారిక వెబ్‌సైట్‌లో మాత్రమే టికెట్లు బుక్ చేసుకోవాలని సూచించారు.

సిద్ధేశ్వరాలయంలో నోములు



ప్రజాశక్తి -ఏర్పేడు : మండలంలోని చిందేపల్లి శ్రీ పార్వతీ సమేత శ్రీ సిద్దేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం దీపావళి నోముల కార్యక్రమం నిర్వహించారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని గౌరీనోములు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆలయ ధర్మకర్త డాక్టర్ గంగలపూడి గిరిధర్ రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అవసరమైన ఏర్పాట్లను చేపట్టారు. ఈ కార్యక్రమంలో చిందేపల్లి మహిళలతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుండి మహిళలు పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

ఈఎస్ఐలో సిపిఆర్‌పై అవగాహన



ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుపతి ఆర్ సి రోడ్ లోని ఈఎస్ఐ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం శ్యాంబాబు ఆధ్వర్యంలో రోగులకు సిపిఆర్ పై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అత్యవసర సమయాల్లో, అగ్ని, విద్యుత్ ప్రమాదాలు, తొక్కిసలాటలు వంటివి జరిగి ఎవరికైనా శ్వాస, గుండె ఆగినప్పుడు ఈ సిపిఆర్ చేయడం ద్వారా కొంతమందినైనా కాపాడుకోవచ్చునని డాక్టర్లు తెలియచేసారు. ఈ కార్యక్రమంలో స్పెషలిస్ట్ డాక్టర్లు కిషోర్ కుమార్, హేమ కుమారి, మురళీకృష్ణ, వైద్యులు, నర్స్ లు, ఆసుపత్రి సిబ్బంది, రోగులు, వారి సహాయకులు పాల్గొన్నారు.